సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 27 | జూన్ | 2023



'మార్పు' మంచికే..

రైతులు తమ ప్రాంత పరిస్థితులను బట్టి పంట మార్పిడి చేసి అధిక దిగుబడి పొందాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. - 8లో▸



పనులు త్వరగా పూర్తి చేయాలి

అధికారులు దత్తత తీసుకున్న గ్రామాల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్ రావు ఆదేశించారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0⁰ /26.0⁰

జిల్లాలో ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

న్యూస్‌రీల్

అమ్మవారికి ఉగ్రప్రభ, త్వరితాక్రమాలలో పూజలు





హన్మకొండ కల్చరల్ : శాకంబరీ ఉత్సవాలలో భాగంగా శ్రీభద్రకాళి దేవాలయంలో సోమవారం అమ్మవారిని ఉగ్రప్రభ, త్వరితాక్రమాలలో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి సుప్రభాతసేవ, నిత్యాహ్నికం నిర్వహించారు. స్నపనమూర్తిని కాళీక్రమంలో.. అష్టమి తిథికి ఆదిదేవత అయిన ఉగ్రప్రభ క్రమంలో అలంకరించారు. భోగభేరాన్ని షోడశీక్రమంలో త్వరితాక్రమంలో అలంకరించి పూజలు నిర్వహించారు. చతుఃస్థానార్చన జరిపారు.

నేడు రక్తదాన శిబిరం

హన్మకొండ: హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎం జె.శ్రీలత తెలిపారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, ఎండీ వి.సి.సజ్జనార్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని రక్తదానం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: వరంగల్ శంభునిపేట దూపకుంటరోడ్డులోని వరంగల్(జీ2) మైనారిటీ బాలికల ఇంగ్లిష్ మీడియం గురుకుల కళాశాలలో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో నాన్‌మైనారిటీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.నీలిమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ(1), ఎస్టీ(1), బీసీ(3), ఓసీ(2) నాన్‌మైనారిటీ సీట్లు ఖాళీగా ఉన్నాయని, పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌కు సన్మానం



కేయూ క్యాంపస్: టీఎస్‌పీఈసెట్ ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించిన హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీపీఈ ఫైనలియర్ పూర్తిచేసిన గుర్రం దేవాను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ అయిలయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, అధ్యాపకులు కరుణాకర్‌రావు, ఫిరోజ్‌పాషా, జితేందర్, సదాశివ, పుల్లా రమేష్, ఆర్.ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22 మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సోమవారం నిర్వహించిన డిగ్రీ కోర్సుల నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో కాపీయింగ్ చేస్తూ 22 మంది విద్యార్థులు పట్టుబడి డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. ఖమ్మం వికాస్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, కవితా డిగ్రీ కళాశాలలో ఒకరు, బోత్ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో 10 మంది, ఇచ్చోడ సాయిసమత డిగ్రీ కళాశాలలో ఏడుగురు, భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, మణుగూరు శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో ఒకరు డీబార్ అయ్యారని వివరించారు.

నేడు ఓరియంటేషన్

కాజీపేట: ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్-23 నామినేషన్ల నమోదుపై టీఎస్ ఎస్‌సీఈఆర్టీ వారిచే మంగళవారం రాష్ట్రస్థాయి ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. టీశాట్ చానల్ ద్వారా 27న మధ్యాహ్నం 2 గంటల నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా ప్రధానోపాధ్యాయులు, పీపీఎల్‌ఎస్, ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఈకార్యమంలో నిపుణులు పి.గణేశం, వీఎస్ఎం(రిటైర్డ్) అధ్యక్షుడు, పల్లె సృజన హైదరాబాద్, ప్రొఫెసర్ ఎస్.సురేశ్‌బాబు పాల్గొని ఉత్తమ ఆలోచనలు, వినూత్న ఆవిష్కరణలు, నాణ్యమైన ఇన్‌స్పైర్ అవార్డుల ప్రాజెక్టుల నమోదుపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల అప్పర్ ప్రైమరీ, సెకండరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని తప్పనిసరిగా వీక్షించాలని కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్‌ను సంప్రదించాలని సూచించారు.

మెళకువలు పాటించాలి

- అనువైన విత్తన రకాలు ఎంచుకోవాలి
- కలుపు నివారణ చర్యలు చేపట్టాలి
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో వరంగల్ డీఏఓ ఉషాదయాళ్

కరీమాబాద్: వరి, ఇతర పంటల సాగులో మెళకువలు పాటించాలి.. అనువైన విత్తన రకాలు ఎంచుకోవాలని వరంగల్ డీఏఓ ఉషాదయాళ్ సూచించారు. సోమవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫోన్ ఇన్'లో అనువైన రకాలేంటి? పత్తి ఎప్పటి వరకు విత్తుకోవచ్చు? కలుపు నివారణ చర్యలు.. ఇలా రైతులు అడిగిన ప్రశ్నలన్నింటికీ ఆమె సమాధానాలిచ్చి సందేహాలను నివృత్తి చేశారు.

ప్రశ్న: మెట్ట వరిసాగు, కలుపు నివారణ గురించి తెలపండి?

– తంగిడి భాస్కర్, సోమారం, పర్వతగిరి

జవాబు: దుక్కిని పొడిగా చేసుకుని నేరుగా వరి విత్తనాలను కార్బన్‌డిజంతో శుద్ధి చేయాలి. ఎకరాకు 10 నుంచి 12 కిలోల విత్తనాలు వెదజల్లాలి. లేకుంటే సీడ్ డ్రిల్‌తో విత్తుకోవాలి. ఈపద్ధతితో నారుమడి లేకుండా.. నేరుగా వరి విత్తుకోవడం ద్వారా ఎకరాకు రూ.10వేల చొప్పున ఖర్చు తగ్గించుకోవచ్చు. కలుపు నివారణకు విత్తిన 48 గంటల్లోపు పదనులో పెండిమెథాలిన్ వాడాలి.

ప్ర: పందిరి కూరగాయల సాగులో కలుపు నివారణ చర్యలు తెలపండి.

– కొండ్ల రాజారాం, బంజరపల్లి, నెక్కొండ



రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉషాదయాళ్

జ: కలుపు నివారణకు మల్చింగ్ విధానం ఉపయోగపడుతుంది. రెండు సాళ్ల మధ్యలో మొక్క 3–4 ఆకుల దశలో ఉన్నప్పుడు క్విజలోఫోప్ ఇథైల్ 2 ఎంఎల్ లేదా ఇమాజితఫైర్ 1.5 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి భూమి పదనులో ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. ఇంకా సమస్యలుంటే ఉద్యాన శాఖ అధికారి శంకర్(79977 25086)ను సంప్రదించండి.

ప్ర: వానాకాలంలో సాగుకు అనువైన మధ్య, స్వల్పకాలిక దొడ్డు వరి రకాలు ఏమున్నాయి?

–మైలు భాస్కర్, నాగారం, నెక్కొండ

మధ్యకాలిక దొడ్డు రకమైతే ఎంటీయూ -1001 రకాన్ని మిల్లర్లు కొనడం లేదు కాబట్టి డబ్ల్యూజీఎల్-915 రకం సాగు చేసుకోవచ్చు. ఇంకా నార్లు పోయని రైతులు స్వల్పకాలిక దొడ్డు రకాలైన జగిత్యాల -24423, కేఎస్ఎం-118 బతుకమ్మ, ఎంటీయూ-1010 రకాలు సాగు చేసుకోవచ్చు.

ప్ర: వరి పంటలో ఏయే రకాలు సాగు చేయవచ్చు.

– రాదారపు రాజయ్య, కొండాయిపల్లి, నల్లబెల్లి

జ: స్వల్పకాలిక సన్న రకాలైన కేఎస్ఎం-1638, వరంగల్-962, రాజేంద్రనగర్-21278, తెలంగాణ సోనా తోపాటు జేజీఎల్-24423, కేఎస్ఎం-118, ఎంటీయూ-1010 వంటి దొడ్డు రకాలు సాగు చేసుకోవచ్చు.

ప్ర: పత్తిలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు తెలపండి?

– తిప్పారపు రాజు, ఎలుకుర్తి, గీసుగొండ

జ: చాలీచాలని వర్షపునీటితో మొలచిన మొక్కలకు వేరుకుళ్లు సోకి తలలు వాల్చి ఆకులు రంగు కోల్పోయి మొక్కలు ఎండిపోతాయి. కాబట్టి మొక్కలన్నింటికీ కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు 1 లీటరు నీటిలో కలిపి మొక్క వేరు భాగంలో తడిచేలా పిచికారీ చేయాలి.

ప్ర: పచ్చిరొట్ట పైర్ల వివరాలు తెలపండి?

– కొడగాని రాజబాబు, ఊకల్, గీసుగొండ

జ: వరి పంట సాగు చేసే రైతులు జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలు వేసుకుని నాట్లు వేసే ముందు కలియదున్నాలి. తెలంగాణ ప్రభుత్వం 65 శాతం సబ్సిడీపై వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీ చేస్తోంది. అవసరమైన రైతులు సంబంధిత ఏఈఓలను సంప్రదించాలి.

అదను దాటలేదు..

- జూలై 15 వరకు విత్తుకోవచ్చు
- నేలకు కావలసిన తడి ఉన్నప్పుడే విత్తుకోవాలి
- భూసార పరీక్షలు చేయించుకోవాలి
- హనుమకొండ డీఏఓ రవీందర్‌సింగ్
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌కు స్పందన

హన్మకొండ: వానా కాలం పంటల సాగుకు ఇంకా అదను దాటలేదు.. జూలై 15 వరకు విత్తనాలు విత్తుకోవచ్చని హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) బి.రవీందర్‌సింగ్ చెప్పారు. సోమవారం జిల్లా సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా జిల్లాలోని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. పంటల సాగుకు సంబంధించి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. డీఏఓ మాట్లాడుతూ నేలకు కావలసిన తడి ఉన్నప్పుడే విత్తనాలు విత్తుకోవాలి.. తడి లేకపోతే విత్తనాలు మొలకెత్తవు.. పాడవుతాయని చెప్పారు. భూసార పరీక్షలు చేయిస్తే నేలలో ఏఏ పోషకాలున్నాయి.. ఏ పంట వేస్తే ఎలాంటి ఎరువులు, ఎంత మోతాదులో వాడాలో తెలుస్తుంది.. తద్వారా అవసరం మేరకు మాత్రమే ఎరువులు వాడి ఖర్చులు తగ్గించుకోవచ్చని సూచించారు. నేల సారాన్ని బట్టి పంటలు ఎంపిక చేసుకోవచ్చని వివరించారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు.



ఫోన్‌ఇన్‌లో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బి.రవీందర్ సింగ్

రైతు: వర్షాలు కురువక సాగు ఆలస్యమవుతోంది. పంటలు ఎప్పటి వరకు సాగు చేయొచ్చు?

– జయపాల్ రెడ్డి, ఆత్మకూర్

డీఏఓ: ఇంకా సమయం ఉంది. జూలై 15 వరకు సాగు చేసుకోవచ్చు. స్వల్పకాలిక పంటలను ఎంపిక చేసుకోవడం మేలు.

రైతు: వర్షాలు పడడం లేదు. వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయి?

–రవీందర్‌రావు, నడికుడ

డీఈఓ: వాతావరణ పరిస్థితులు సాధారణంగానే ఉంటాయని ఆ శాఖ చెబుతోంది. ఆందోళన అవసరం లేదు. పంటల సాగుకు ఇంకా సమయం ఉంది.

రైతు : వ్యవసాయాధికారి, ఏఈఓ అందుబాటులో ఉండడం లేదు. రైతు సదస్సులు పెట్టడం లేదు.

–దాసరి రవి, పెద్దకోడెపాక

డీఏఓ: అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటాను. రైతులకు అందుబాటులో ఉండేలా చూస్తాను.

రైతు: మావి చౌడు నేలలు. జీలుగ పంట వేశాం. ఇంకా చౌడు ప్రభావం తగ్గించడానికి ఏం చేయాలి. గొర్రె ఎరువు వేస్తే చౌడు ప్రభావం తగ్గుతుందా? ఆర్‌ఎన్‌ఆర్ సాగు చేయొచ్చా?

–కొమ్ము కుమారస్వామి, కొత్తపల్లి

డీఏఓ: చౌడు నివారణకు జీలుగ బాగానే పని చేస్తుంది. భూసార పరీక్షలు చేయించుకుంటే చౌడు మోతాదు తెలుస్తుంది. ప్రభావం తగ్గించుకునేందుకు ఇంకా ఏమీ చేయాలో నిర్ణయం తీసుకోవచ్చు. గొర్రె ఎరువు, పశువుల పేడ కూడా ఉపయోగమే. ఆర్‌ఎన్‌ఆర్ సాగు చేయొచ్చు.

రైతు: మాకు రెండున్నర ఎకరాల చౌడు భూమి ఉంది. ఏ పంటలు వేయాలి.

– సమ్మయ్య, పులిగిల్ల

డీఏఓ: ముందుగా భూసార పరీక్షలు చేయించి ఫలితాలను బట్టి ఏ పంటలు సాగు చేయొచ్చు నిర్ణయం తీసుకోవచ్చు.

రైతు: వర్షాలు ఆలస్యంగా పడుతున్నాయి. కొత్త రకం పంటలు ఏమైనా వచ్చాయా..? అధిక వర్షాలతో ఆయిల్‌పాంకు ఏమైనా నష్టం ఉంటుందా..?

– అమ్మ అశోక్, పెద్దకోడెపాక

డీఏఓ: పంటల సాగుకు ఇంకా సమయం ఉంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొత్త పంటల విషయానికొస్తే ఆయిల్‌పాం సాగు చేసుకోవచ్చు, అధిక వర్షాలతో ఎలాంటి నష్టం ఉండదు. ఇంకా డ్రాగన్ ఫ్రూట్, ఔషధ మొక్కల పెంపకం వంటివి ఉన్నాయి. ఇన్నోవేటివ్‌గా వెళ్లాలంటే చాలా రకాలున్నాయి. వీటికి మంచి మార్కెటింగ్ ఉంది.

వినతులు సత్వరమే పరిష్కరించాలి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సత్వరమే పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈడీ ఎస్సీ కార్పొరేషన్‌కు 25, హన్మకొండ తహసీల్దార్ 22, టు బీహెచ్‌కే నోడల్ ఆఫీసర్ 14, ఎల్కతుర్తి తహసీల్దార్ 13, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ 12 వినతులతో పాటు మొత్తం 180 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఓ జగదీశ్వర్, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీఎండబ్ల్యూఓ శ్రీను, ఏడీ ల్యాండ్ రికార్డు ప్రభాకర్, డీడబ్ల్యూఓ మధురిమ, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చొరవ తీసుకోవాలి : వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య



సమస్య వింటున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చొరవ తీసుకోవాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 98 అర్జీలు వచ్చాయి. అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స, వ్యవసాయశాఖ అధికారితోపాటు అధికారులు పాల్గొన్నారు.

పఠనంతో భావవ్యక్తీకరణ

- నిత్యం విద్యార్థులు పుస్తకాలు చదవాలి
- పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

విద్యారణ్యపురి: పఠనంతోనే నూతన ఆలోచనలు, భావవ్యక్తీకరణ సాధ్యమవుతుందని, నిత్యం స్కూల్‌తోపాటు గ్రంథాలయంలోని వివిధ కథల పుస్తకాలను చదవాలని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం పఠనోత్సవాన్ని డీఈఓ ఎండీ అబ్దుల్ హైతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో ప్రతి పీరియడ్‌కు పది నిమిషాల పాటు సంబంధిత సబ్జెక్టులో పఠనం చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పఠనానికి ప్రతిరోజు ఒక పీరియడ్ కూడా ఉంటుందని చెప్పారు. తల్లిదండ్రులు సైతం ఇంటివద్ద పిల్లలను చదివించాలని సూచించారు. డీఈఓ మాట్లాడుతూ పుస్తక పఠనోత్సవ కార్యక్రమం జూలై 31 వరకు కొనసాగుతుందని, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా విద్యార్థులతో పఠనం చేయించాలని కోరారు. పాఠశాల హెచ్‌ఎం ఉప్పలయ్య, రోటరీ క్లబ్ ప్రతినిధి మంజుల మాట్లాడారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ ప్రతినిధులు పాఠశాలకు రెండు ఫ్యాన్‌లు అందజేశారు. మంజులతోపాటు నరేష్, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.



పుస్తక పఠనోత్సవంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ

సామూహిక పఠనం

హనుమకొండ జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో సోమవారం పఠనోత్సవం నిర్వహించారు. రాష్ట్ర పరిశీలకులు, ఎస్‌సీఆర్‌టీ ప్రొఫెసర్ రవికాంతారావు ఐనవోలు మండల పరిధి పాఠశాలలు, వెంకటపూర్ జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్, ఒంటిమామిడిపెల్లి జెడ్పీ హెచ్ఎస్, ఐనవోలు కేజీబీవీని సందర్శించి విద్యార్థులతో సామూహిక పఠనం చేయించారు. వెంకటాపూర్ ఎంపీపీఎస్‌లో లైబ్రరీని ప్రారంభించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబలైజ్ కోఆర్డినేటర్ బి.రాధ, ఎఫ్ఎల్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో నగదు జమ

మొదటి రోజు 59,249 మందికి రైతుబంధు

కరీమాబాద్: వానాకాలం పంటల సాగు పెట్టుబడి కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 'రైతుబంధు' పథకం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అందులో భాగంగా మొదటిరోజు సోమవారం వరంగల్ జిల్లాలోని 13 మండలాలకు సంబంధించి 59,249 మంది రైతుల ఖాతాల్లో రూ.17,26,06,567లు జమయ్యాయి.

లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తం..

- ప్రజల నుంచి సమాచారం అందగానే స్పందించాలి
- క్షేత్ర స్థాయి అధికారులకు, సిబ్బందికి సెలవుల్లేవ్
- సమీక్ష సమావేశంలో గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా


వరంగల్ అర్బన్: వర్షాలు మొదలైనందున లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ.. సమాచారం అందిన వెంటనే స్పందించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో మాన్‌సూన్ ఏర్పాట్లపై ముందస్తు సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగర వ్యాప్తంగా ఎఫ్‌టీఎల్ పరిధిలోని డివిజన్లపై ఈఈలు, డీఈలు ప్రత్యేక దృష్టి సారించి జాబితాలు తయారు చేసి సమర్పించాలన్నారు. వర్షాలు, వరదలను ఎదుర్కోవడానికి బల్దియా తరఫున వివిధ విభాగాల సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ టీమ్‌లను ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎఫ్‌టీఎల్ ప్రాంతాల వార్డులకు కేటాయించిన బృందాలు సన్నద్ధతతో ఉండాలని, ప్రమాదాలను ముందస్తుగా పసిగట్టి స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. ఈ మేరకు తాత్కాలికంగా పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఓపెన్ ప్లాట్లు ఉన్న వారికి ఈనెల 30 లోగా నోటీసులు అందజేసేలా చూడాలని సూచించారు. నగర వ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న 291 నిర్మాణాలను గుర్తించి బాధ్యులకు నోటీసులు అందించామని, ఆయా నిర్మాణాలకు ప్రమాద సూచికల బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నాలాల్లో డీ సిల్టింగ్ ప్రక్రియ చేపట్టి.. ప్రాంతాల వారీగా అదనపు కమిషనర్‌లు, డిప్యూటీ కమిషనర్‌లు, డీసీపీలు, ఏసీపీలు, ఈఈలు పర్యవేక్షించి నాలుగు రోజుల్లో ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని పేర్కొన్నారు. మ్యాన్ హోల్స్ క్లీనింగ్ తర్వాత మార్కింగ్ చేయాలని, జవాన్‌లు విధులు నిర్వహిస్తున్న ప్రాంతంలో ఎన్ని మ్యాన్ హోల్స్ ఉన్నాయో అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రస్తుత వర్షాకాలం అప్రమత్తత నేపథ్యంలో క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందికి సెలవుల మంజూరు కుదరని కమిషనర్ స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్లు రవీందర్ యాదవ్, అనిసుర్ రషీద్, ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, కృష్ణారావు, సిటీ ప్లానర్ వెంకన్న, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్ఓ శంకర్‌లింగం, డిప్యూటీ కమిషనర్ జోనా, ఎంహెచ్ఓ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

మహిళలతోనే మార్పు సాధ్యం

జిల్లా సంక్షేమాధికారి కె.మధురిమ



ర్యాలీని ప్రారంభిస్తున్న కె.మధురిమ, డీసీపీ

హన్మకొండ అర్బన్ : మహిళలతోనే మార్పు సాధ్యమని జిల్లా సంక్షేమాధికారి మధురిమ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం అదాలత్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్‌లో ఏర్పాటు చేసిన సదస్సులో మధురిమ మాట్లాడుతూ.. సమాజం ప్రగతి బాటన పరుగులు తీయాలంటే మహిళలు ముందుండాలన్నారు. కుటుంబ వ్యవస్థలో తల్లిదండ్రుల పాత్ర కీలమని, పిల్లలకు నైతిక విలువలను చిన్ననాటి నుంచే అలవర్చాలని చెప్పారు. యాంత్రిక జీవితంలో పిల్లలు ఏం చేస్తున్నారో తెలుసుకోలేని పరిస్థితిలో ఉన్నప్పుడు స్నేహితులు, సోషల్ మీడియా ప్రభావంతో యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సాంబశివరావు మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడిచి దేశానికి మంచి పేరు తేవాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్ సుజాత మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం విషయంలో టార్గెట్ గ్రూప్, టార్గెట్ ఏరియాలపై దృష్టి సారించి సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సైకియాట్రిస్ట్ డాక్టర్ శ్రీనివాస్, డీఈఓ అబ్దుల్‌హై, డీసీపీఓ పి.సంతోష్‌కుమార్, ఎఫ్‌ఆర్‌ఓ రవికృష్ణ, సీనియర్ సహాయకులు వి.వెంకట్‌రావు, హెల్పింగ్ హ్యాండ్ డైరెక్టర్ రాము, సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీ, ఏసీపీలు కిరణ్‌కుమార్, శ్రీనివాస్, అదనపు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్‌మోహన్‌రావు, యాకూబ్‌పాషా, డెమో వి.అశోక్‌రెడ్డి, సీడీపీఓ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

బల్దియాకు చెడ్డపేరు తెస్తే వేటు తప్పదు

- కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా
- గ్రేటర్ గ్రీవెన్‌కు సమస్యల వెల్లువ
- అర్జీదారులతో కిటకిటలాడిన ఆవరణం

వరంగల్ అర్బన్: గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల విషయంలో కొంత మంది ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.. ఇకనైనా తీరు మారాలి.. బల్దియాకు చెడ్డపేరు తెస్తే వేటు తప్పదని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు.

వరంగల్ మహా నగర పాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో నగర ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. మొత్తం 109 వినతులు అందగా.. అందులో ఇంజనీరింగ్ విభాగానికి 17, విపత్తుల నివారణ విభాగానికి 1, హెల్త్ అండ్ శానిటేషన్‌కు 10, రెవెన్యూ సెక్షన్‌కు 24, టౌన్ ప్లానింగ్ విభాగానికి 48, తాగునీటి సమస్యలపై 6, ఎలక్ట్రికల్ సెక్షన్‌కు 3 ఉన్నాయి. అనంతరం కమిషనర్ ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో వినతులపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో పురోగతి ఉండాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. ముఖ్యమైన అంశాల విషయంలో సొంత నిర్ణయాలు కాకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యలు వెంటనే పరిష్కరిస్తే అర్జీదారులు మళ్లీ గ్రీవెన్స్‌కు వచ్చే అవకాశం ఉండదని పేర్కొన్నారు. ఇటీవల 866 ఫిర్యాదులు స్వీకరించగా 497 పరిష్కరించామని, 370 పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు వివరించారు.

పట్టణ ప్రణాళిక విభాగంపై..

నగరంలో అక్రమ వెంచర్లు, అక్రమ రోడ్ల నిర్మాణం వంటి విషయాలు చైన్ మెన్‌లకు తెలిసినా.. పైస్థాయి అధికారుల వరకు చేరకుండా నియంత్రిస్తున్నారని చెప్పారు. క్షేత్రస్థాయిలో సమస్యలను దాచడం వల్ల వ్యవస్థకు చెడ్డ పేరు వస్తుందన్నారు. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంజనీరింగ్ విభాగంపై..

వివిధ అభివృద్ధి పనుల నిర్మాణలకు జియో ట్యాగ్ చేయాలని, రోడ్డు నిర్మాణాలు చేపట్టే క్రమంలో ప్రాధాన్యత క్రమంలో ఎక్కువ మంది ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పనులు చేపట్టాలని సూచించారు. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. క్వాలిటీ కంట్రోల్‌లో నమోదు చేసిన సమాచారం ఎంబీలలోనూ ఉండాలని, నాణ్యత, అంచనాలు సంబంధిత సమాచారం పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రేటర్ గ్రీవెన్‌లో అందిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఎలక్ట్రికల్ ఏఈ నాగుల సరితను కమిషనర్ అభినందించి సత్కరించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్లు రవీందర్ యాదవ్, అనిసుర్ రషీద్, సీఎంహెచ్‌ఓ రాజేష్, సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ వెంకన్న, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్ఓ శంకర్‌లింగం, డిప్యూటీ కమిషనర్ జోనా, ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



గ్రేటర్ గ్రీవెన్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్, అధికారులు

సమన్వయంతో పనిచేయాలి..

- ప్రజారోగ్య విభాగం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు సమన్వయంతో పనిచేయాలని, చెత్త తరలింపు కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కమిషనర్ ఆదేశించారు. కొంత మంది జవాన్ల పనివిధానం సరిగాలేదని, వైఖరి మార్చుకోవాలని, అవినీతికి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.
- వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలను గుర్తించి నీరు నిల్వకుండా చూడాలని, శానిటేషన్ నిర్వహణ పనులు ఏజెన్సీలకు అప్పగించిన తరుణంలో వాటిపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక




ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు, కోచ్‌లు, పీఈటీలు

వరంగల్ స్పోర్ట్స్: ఈ నెల 28 నుంచి జులై 1 వరకు హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఆదివారం కాజీపేట ఫాతిమానగర్‌లోని సెయింట్ గాబ్రియేల్స్ స్కూల్ మైదానంలో నిర్వహించారు. అండర్-18 బాలబాలికల విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికకు 22 మంది బాలురు, 24 మంది బాలికలు హాజరైనట్లు హనుమకొండ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లపెల్లి రాజు, డోలి సాంబయ్య తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. యూసఫ్‌గూడలోని కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నాలుగు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో హనుమకొండ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. బాలుర విభాగం ఎంపికైన వారిలో జి సాయికుమార్, కె.సాయిసానిత్, వి.సూరేశ్వర్, పి.చరణ్, టి.చండి సాయికుమార్, టి.దేవిశ్రీకుమార్, పీఎస్ఎం అక్షయ్, కె సాయిచరణ్, ఎల్ మణిరాజ్, ఎస్ నిహాల్, పి విభవ్, సి అరుష్, స్టాండ్‌బై లుగా ఎం.మహేష్, జి.నిహాల్, యు.జాషిక్, ఎస్.సూజిత్‌రాజ్, బాలికల విభాగంలో టి.మీనాక్షి, టి.హోమప్రియ, రిమ్యాజై సాబ్, జి.దీక్షిత, సీహెచ్.సహస్ర, జీ మేరీహాసినీరెడ్డి, వి.భావిష్య, జె.తేజస్వీ, కె.యుక్తశ్రీ, సి.నందిత, కె. బృందా, బి.సమరచరిష్మ, స్టాండ్‌బై లుగా బి షారోన్, గాయత్రిహరీష్, సీహెచ్.సాన్వి, పి.వేలిక ఎంపికై నట్లు తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో పీఈటీలు విజయ్‌కుమార్, సునిలా, కోచ్ ఇర్ఫాన్, యశ్వంత్, సీనియర్ క్రీడాకారులు సాగర్, వంశీ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

‘మార్పు’ మంచికే..

పంట మార్పిడిని పాటించకుండా మూస పద్ధతిలో మందుకెళ్లడం.. పైగా సంవత్సరాల తరబడి ఒకే పంట వేయడం.. ఆపై అధికారుల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకోకుండా సాగు చేయడం వల్ల రైతులు నష్టాల బారిన పడుతున్నారు. భూమిలో ఎప్పటికీ ఒకే రకం పంటలు సాగు చేయడం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా పంటల దిగుబడిలోనూ ప్రభావం చూపుతుంది. చీడపీడల వ్యాప్తి పెరుగుతూ వస్తుంది. ఫలితంగా వాతావరణంలో వస్తున్న మార్పులతో పంటల పెట్టుబడికి వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. తద్వారా అన్నదాతలు ఆర్థికంగా కృంగిపోయి తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో దీనిని నివారించేందుకు గాను రైతులు తమ ప్రాంత స్థితిగతులను బట్టి పంట మార్పిడి చేసి.. నీటి వసతిని బట్టి సాగు చేపట్టి అధిక దిగుబడి పొందాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు.

– కరీమాబాద్/కాజీపేట



పంట మార్పిడితో ఎన్నో ప్రయోజనాలు

- చీడపీడల వ్యాప్తికి అడ్డుకట్ట
- అధిక దిగుబడికి దోహదం
- భూసారం దెబ్బతినకుండా రక్షణ
- సాగులో మెళకువలు పాటించాలని అధికారుల సూచన

నీటి వసతిని బట్టి మళ్లీ మళ్లీ..

సాధారణంగా నీటి వసతులున్న చోట రైతులు వరి తర్వాత మళ్లీ వరి, మొక్కజొన్న పంటలు వేస్తారు. తర్వాత మళ్లీ మొక్కజొన్న, వేరుశనగ వేయడం ఆనవాయితీగా వస్తోంది. అంతేకాకుండా పత్తి, మిరప, పొగాకు తదితర వాణిజ్య పంటలను కూడా ఇదే పద్ధతిలో పండిస్తారు. దీంతో భూమిలోని ఒకే లోతు పొర నుంచి మొక్క.. పోషకాలు తీసుకోవడం వల్ల నేల నిస్సారమవుతుంది. ఇక పత్తి, మిరప, పొగాకు, కంది లాంటి పంటలు వేర్ల లోపలి పొరల నుంచి పోషకాలు తీసుకోవడం మూలంగా నేల భౌతిక లక్షణాలు, స్వభావం దెబ్బతినడమే కాకుండా ఈ పైర్లను ఆశించే చీడపీడలు స్థిర నివాసమేర్పుకునే అవకాశముంటుంది. ఫలితంగా తర్వాత పంటకు తీవ్ర నష్టం కలిగిస్తాయి.

పంట మార్పిడి క్రమంలో..

రైతులు పంట మార్పిడి చేసే క్రమంలో ఆహార, వాణిజ్య పంటలు ఒకసారి అంటే ఖరీఫ్‌లో పప్పు జాతి (చిక్కుడు) వేస్తే రబీలో పంట మార్పిడి చేయాలి. అవసరమైనప్పుడు పశుగ్రాసం కోసం గడ్డి జాతి పైర్లు, భూసారం పెంచడానికి పచ్చిరొట్ట వేసుకోవాలి. పప్పుజాతి పంటల వేళ్ల బుడిపెలలోని రైజోబియం సూక్ష్మజీవులు గాలిలోని నత్రజనిని మొక్కలకు అందిస్తాయి.

మార్పిడిలో పంటల సరళి..

పంటల మార్పిడి చేసే రైతులు వాటి సరళి(కాంబినేషన్)ని పాటిస్తే అద్భుత ఫలితం ఉంటుంది. ఇందులో భాగంగా పప్పుధాన్యపు పంట, ఆహార పంట, రుధాన్యాల ఆహార పంట, చిక్కుడు జాతి పచ్చిరొట్ట పైరు, వరి, వేరుశనగ, మొక్కజొన్న, పత్తి, మొక్కజొన్న, పొగాకు, మిరప, కూరగాయలు, చెరకు, వరి, కంది, జొన్న, మినుము, సోయాచిక్కుడు, ఆముదం, సజ్జ, జొన్న వంటి పంటలను మార్పిడిగా వేసుకోవాలి.

అంతర పంటలుగా మొక్కజొన్న, పెసర..

లోతు తక్కువైన ఎర్రనేలల్లో, సేంద్రియ పదార్థం తక్కువున్న నేలల్లో పత్తికి బదులు కందిలో అంతర పంటలుగా మొక్కజొన్న లేదా కందిలో పెసర లేదా మినుము పంటలను వేసుకోవచ్చు. అపరాల పంటలను వేయడం వల్ల వాటి వేర్ల బుడిపెలలో నివాసం ఏర్పరచుకునే ఒక రకమైన బ్యాక్టీరియాలు గాలిలోని నత్రజనిని గ్రహించి నేలలో స్థిరీకరిస్తాయి. దీనివల్ల తరువాత వేసే పైర్లకు నత్రజని వినియోగంలోకి వచ్చి మంచి ప్రయోజనకరం ఉంటుంది.

పంట మార్పిడి..ఫలితం..

- వరి తర్వాత మినుము, పెసర, వేరుశనగ, చెరుకు వేయడం వల్ల సుడిదోమ, టుంగ్రో వైరస్‌ను నివారించొచ్చు.
- చెరుకు తర్వాత వరి వేయడం వల్ల వేరుపురుగు నివారించొచ్చు. వరిలో దోమపోటు నియంత్రించొచ్చు.
- పత్తి వేసిన భూమిలో జొన్న, మొక్కజొన్న, నువ్వులు, మినుములు వేస్తే లద్దె పురుగు, పచ్చపురుగును నివారించొచ్చు.
- జొన్న, మొక్కజొన్న తర్వాత కంది వేస్తే కంది లో కాయతొలుచు పురుగు ఉధృతి తగ్గుతుంది.
- పొలంలో ముందు పప్పుధాన్యం పైర్లు వే యడం మూలంగా నేల సారవంతమవుతుంది.
- వేరుశనగలో ఆకుముడత నివారించడానికి పప్పుజాతికి చెందిన పైరుతో మార్పిడి చేయాలి.
- కంది, మిరపలో ఎండు తెగులు నివారణకు జొన్న, మొక్కజొన్న పంటలతో మార్పిడి చేయాలి.
- కందిపంటను జొన్న,మొక్కజొన్న, నువ్వుల పంటలతో మార్పిడి చేస్తే కాయ తొలిచే పురుగుల ఉధృతి తగ్గుతుంది.
- నులిపురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలలో వేరుశనగ, మిరప, పొగాకు, వంగ పైర్లను కొన్ని పంటకాలాలు వేయొద్దు.
- ఆహార, వాణిజ్య పంటలను పశుగ్రాసం పైర్లతో ఒకసారి, పప్పుజాతి పైర్లతో మరోసారి మార్పిడి చేయడం మేలు.

తప్పనిసరిగా పంట మార్పిడి చేయాలి..



పంట మార్పిడి ద్వారా రైతులకు చాలా లాభాలున్నాయి. భూసారాన్ని కాపాడుకోవడంతోపాటు పంటల దిగుబడిలో కూడా తేడా వస్తుంది. ఖరీఫ్‌లో ఒక రకం, రబీలో మరో రకం పంటలు వేయడం వల్ల చీడపీడల వ్యాప్తిని అరికట్టొచ్చు. ఆహార పంటలు, వాణిజ్య పంటలను మార్పిడి చేసుకోవాలి.

– డాక్టర్ రాజు, శాస్త్రవేత్త

పంటల మార్పిడిపై దృష్టి సారించాలి



రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలి. ప్రస్తుతం అనువైన సమయం. అందుకే తమ నేలలను భూసారపరీక్ష చేయించి ఫలితాలకు అనుగుణంగా వేయాల్సిన పంటలను నిర్ణయించుకోవాలి. తమకున్న నీటివసతి, నేల స్థితిగతులను బట్టి పంటల మార్పిడికి ప్రణాళికలు రూపొందించుకోవాలి.

– దొండపాటి శ్రీధర్‌రెడ్డి, ఏఓ, కాజీపేట

తిరకాసు..

- ఒకే స్థలం.. రెండుసార్లు రిజిస్ట్రేషన్
- మీకు విక్రయించలేదంటున్న మహిళ
- లబోదిబోమంటున్న బాధితులు
- న్యాయం చేయాలని సీపీకి విజ్ఞప్తి



రిజిస్ట్రేషన్‌పత్రాలను చూపిస్తున్న బాధితులు రవి, నిరంజన్

ఖిలా వరంగల్: రోడ్డు కోసం స్థలం విక్రయించిన 8 ఏళ్ల తర్వాత మళ్లీ అదే భూమిని తన అన్నకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసిన ఓ మహిళ.. ఈ స్థలం మీకు విక్రయించలేదు.. ఈ దారి నుంచి నడిచేదిలేదంటూ బెదిరింపులకు పాల్పడుతూ తమను బ్లాక్‌మెయిల్ చేస్తోందని బాధితులు నూనె రవి, సామల నిరంజన్ ఆదివారం తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, దీనిపై స్పందించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో తమకు ఆత్మహత్యలే శరణ్యమని వారు వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను వేడుకున్నారు. బాధితుల కథనం ప్రకారం ..ఖిలావరంగల్ శివారు దూపకుంట రోడ్డులో సర్వే నంబర్ 1372 న్యూ(831)లో బాధితులు నూనె రవి, సామల నిరంజన్‌తోపాటు మరో ఆరుగురు వ్యక్తులు 2012లో ఇంటి నిర్మాణం కోసం స్థలాలు కొనుగోలు చేశారు. అనంతరం 2014 జూలై 17న దూపకుంట రోడ్డుకు చెందిన ఆకుల దివ్య వద్ద నుంచి ఇంటి దారి కోసం 21 ఫీట్ల వెడల్పు, 210 ఫీట్ల పొడవుతో 490 గజాల స్థలం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో 8 ఏళ్ల క్రితం విక్రయించిన స్థలాన్నే మరోసారి ఆకుల దివ్య తన అన్న ఆకుల దిలీప్‌కు 2022 నవంబర్ 24న గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసి రాజకీయ నేతలు, కబ్జాదారులను రంగంలోకి దింపి బేరసారాలు ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారి నుంచి నడిచేదిలేదంటూ బెదిరింపులకు గురిచేస్తున్నారని కన్నీరుమున్నీరయ్యారు. సదరు మహిళతోపాటు తన అన్న ఆకుల దిలీప్ కలిసి డబుల్ రిజిస్ట్రేషన్‌కు పాల్పడటమే కాకుండా తమను బ్లాక్ మెయిల్ చేస్తూ పెద్ద ఎత్తున డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నారు. దీనిపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో మే 27న ఫిర్యాదు చేశామన్నారు. అయితే పోలీసులు కేసు నమోదు చేయకుండా విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని వాపోయారు. దీనిపై స్పందించి దివ్య, తన అన్న దిలీప్‌పై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని వారు సీపీ ఏవీ రంగనాథ్‌ను వేడుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి మడికొండ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన పెసరు హరీశ్(23) పని నిమిత్తం తన పల్సర్ బైక్‌పై స్నేహితుడు పెసరు శ్రీరామ్‌తో కలిసి గ్రామం నుంచి రాత్రి 7.30 గంటలకు హనుమకొండకు బయలు దేరాడు. ఈ క్రమంలో నర్సింగరావు పల్లి దాటాక ధర్మసాగర్–మడికొండ బ్రిడ్జిపై వారి బైక్‌ను లారీ ఓవర్ టెక్ చేసి ఒక్కసారిగా బ్రేక్ వేసింది. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి లారీని ఢీకొంది. ఈ ఘటనలో హరీశ్ అక్కడికక్కడే మృతి చెందగా శ్రీరామ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం శ్రీరామ్‌ను 108లో ఎంజీఎంకు తరలించారు. మృతుడి తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింహారావు తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలిక..

రామన్నపేట : విద్యుదాఘాతంతో ఓ బాలిక మృతి చెందింది. ఈ ఘటన సోమవారం వరంగల్ ఎల్‌బీనగర్‌లో జరిగింది. ఇంతేజార్‌గంజ్ పోలీసుల కథనం ప్రకారం ఎల్‌బీనగర్‌లో నివాసం ఉంటున్న మహ్మద్ అసిఫ్ కూతురు ఐమాన్ (12) ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఇంటి సమీపంలోని మున్సిపల్ వాటర్ ట్యాంక్ వద్ద నల్లా ట్యాప్‌ను తిప్పే క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. ఈ ఘటనలో కింద పడిన ఐమాన్‌ను..తల్లి అస్మ చూసి తన తమ్ముడు యూసఫ్ సహకారంతో చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించింది. బాలికను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అనంతరం కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న సీఐ మల్లేశ్ తెలిపారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని..

- యువకుడు ఆత్మహత్య



వెంకటేష్ మృతదేహం

గూడూరు: మద్యానికి బానిసైన ఓ యువకుడు.. తల్లిదండ్రులను డబ్బు అడుగగా వారు నిరాకరించారు. దీంతో ఆవేశానికి గురైన ఆయన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని బొల్లెపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పడిగె భద్రయ్య, స్వరూప దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉంది. పెద్ద కొడుకు వెంకటేశ్ (22) చదువుకోకుండా తాగుడుకు బానిసై తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తల్లిదండ్రులను తనకు మద్యం సేవించేందుకు డబ్బు కావాలని అడగ్గా వారు ఇవ్వకుండా కూలికి వెళ్లారు. దీంతో కోపోద్రిక్తుడైన వెంకటేశ్ ఇంట్లో ఉరి వేసుకున్నాడు. రాత్రి ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులకు కొడుకు ఉరివేసుకొని కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. తండ్రి భద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.

బైక్, ఆటో ఢీ.. నలుగురికి గాయాలు

ఖిలా వరంగల్: ఖమ్మం జాతీయ రహదారిపై స్నేక్ డ్రైవ్‌తో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఆటోను ఢీకొనడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడడంతో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం రంగశాయిపేట ఆర్టీఏ జంక్షన్ సమీపంలోని హంస బేకరి ఎదుట చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల క థనం ప్రకారం.. పర్వతగిరి మండలం రావూర్‌కు చెందిన ఆర్.శ్రీనిజ (23), ఖిలావరంగల్ మండలం తిమ్మాపురానికి చెందిన హరిత(23), జఫర్‌ఘడ్‌కు చెందిన మౌనిక(22), జక్కలొద్దికి చెందిన రాహుల్(23) వీరంతా బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో బీఈడీ చదువుతున్నారు. సోమవారం ఉదయం టీచింగ్ ట్రెనింగ్ నిమిత్తం వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వచ్చారు. సాయంత్రం 4 గంటలకు వర్ధన్నపేటకు వెళ్తున్న ఆటోలో బీఈడీ విద్యార్థులు ఎక్కారు. ఆటో ఎక్కిన పది నిమిషాల్లోనే రంగశాయిపేట ప్రాంతం తెలంగాణ కాలనీకి చెందిన ఓ వ్యక్తి రాంగ్‌రూట్‌లో ఓవర్‌స్పీడ్ స్నేక్ డ్రైవ్‌తో బై క్‌పై వెళ్తూ ఆటోను బలంగా ఢీకొట్టాడు. అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాకొట్టింది. శ్రీనిజ, హరితకు తీవ్రగాయాలు కాగా.. మౌనిక, రాహుల్‌కు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు.మిల్స్‌కాలనీ ఎస్సై సాంబయ్య ఘటనస్థలానికి చేరుకున్నారు.

మరో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆమోదం

కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు మ రో కార్యాలయానికి సోమవారం రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజీ నవీన్‌మిట్టల్ ఆమోదం తెలిపి ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే భూపాలపల్లి జిల్లా దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేస్తుండగా భూ క్రయవిక్రయాదారుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో వారి ఇబ్బందులు తీర్చడానికి నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆమోదం తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో నూతన కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

- రోడ్డు ప్రమాద మృతులకు కన్నీటి వీడ్కోలు
- సొసైటీకాలనీ శ్మశానవాటికలో ముగిసిన అంత్యక్రియలు
- తల్లిదండ్రులు, అక్కకు అంత్యక్రియలు నిర్వహించిన కుమారుడు అక్షయరాజ్



వీకర్స్ సెక్షన్ కాలనీలో మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు, స్థానికులు



తల్లిదండ్రులు, అక్క అంతిమయాత్రలో పాల్గొన్న అక్షయ్‌రాజ్

కాశిబుగ్గ : మేడారం వెళ్లొస్తూ హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పత్తిపాక రోడ్డు సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాశిబుగ్గ వీకర్స్ సెక్షన్‌కాలనీకి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు అనుముల నర్సింహస్వామి, వెల్దండి సాంబరాజు, వెల్దండి ఆకాంక్ష, వెల్దండి లక్ష్మి ప్రసన్నలు దుర్మరణం చెందగా, అనుముల రాజశ్రీ, హర్షితలు తీవ్ర గాయాలపాలై ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆదివారం రాత్రి మృతదేహాలను ఎంజీఎంకు తరలించి సోమవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం నర్సింహస్వామి నివాసానికి తరలించారు. స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి నలుగురి మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సొసైటీ కాలనీ శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర నిర్వహించారు. అనంతరం దంపతులు వెల్దండి సాంబరాజు, ఆకాంక్షను ఒకే చితిపై పెట్టి వారి కుమారుడు అక్షయ్‌రాజ్‌తో అంతిమసంస్కారాలు చేయించారు. అలాగే అక్క లక్ష్మి ప్రసన్నను బొంద(పూడ్చి) పెట్టారు. నర్సింహస్వామిని మరో చితిపై పెట్టి అతని కుమారుడు ఆకాశ్‌తో అంతిమ సంస్కారం చేయించారు.

ఎమ్మెల్యే, కార్పొరేటర్ ఆర్థికసాయం

ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అనుముల రాజశ్రీ, హర్షితను వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆదివారం రాత్రి ఎంజీఎంలో పరామర్శించారు. సోమవారం ఉదయం వారి కుటుంబ సభ్యుల అంత్యక్రియలకు నరేందర్ రూ.25 వేలు, 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత అందించిన రూ. 15 వేలు ఆర్థికసాయాన్ని మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్, వేముల నాగరాజు మృతుల కుటుంబానికి అందజేసి దగ్గరుండి వారి అంత్యక్రియలు నిర్వహించారు.

పేద పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలి

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని , విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ఫీజులో 25 శాతం రాయితీ ఇవ్వాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. సోమవారం ఏకశిల పార్కువద్ద ఆయన ఇతర బాధ్యులతో కలిసి దీక్షలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య (ఏఐఎఫ్‌డీఎస్) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 28న ఏకశిల పార్కు వద్ద చేపట్టనున్న నిరాహారదీక్షలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ కల్పించాలన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా బాధ్యురాలు సావిత్రి, ఏఐఎఫ్‌డీఎస్ హనుమకొండ జిల్లా నాయకులు రాంమోహన్, మధు, రాము, మోహన్, సాయి, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 9 మంది అరెస్ట్

కాజీపేట: సుబేదారి పోలీస్ స్టేషన్‌పరిధిలోని ఓ ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి 9 మందిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అశోక కాలనీకి చెందిన గణప సుధాకర్ ఇంట్లో కొంతమంది వ్యక్తులు కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి రూ.60,2400, 9 స్మార్ట్‌ఫోన్లు, ప్లే కార్డ్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలి పారు. గణప సుధాకర్, పింగిళి రాజిరెడ్డి, మారుతి అశోక్, పోతు శోభన్, బైరెడ్డి వెంకటరెడ్డి, ఎలకంటి సతీష్, జనగాం మూర్తి, వేణుగోపాల్, శీలం హరి ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో సీఐలు రాంబాబు, శ్రీనివాస్‌రావు, ఎస్సైలు లవన్‌కుమార్, నాసీర్ పాషా, శరత్, రాజు పాల్గొన్నారు.

దత్తత గ్రామాల్లో పనులు పూర్తి చేయాలి


- ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్ రావు



మాట్లాడుతున్న గోపాల్ రావు

హన్మకొండ: అధికారులు దత్తత తీసుకున్న గ్రామాల్లో పనులు పూర్తి చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు ఆదేశించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో వరంగల్, మహబూబాబాద్ జిల్లాల ఎస్.ఈలు, డీఈలు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లాలు, డివిజన్‌లు, విభాగాల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, కాలిపోయిన, పనిచేయని మీటర్లను మార్చాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వైఫల్యాలను తగ్గించాలని సూచించారు. మరమ్మతులు ఆలస్యం కాకుండా చూడాలని, రోలింగ్ స్టాక్ ఉండేలా జాగ్రత్త పడాలని చెప్పారు. ఏడాది పైబడిన డిస్కనెక్షన్ సర్వీసులను తనిఖీ చేయాలని, సబ్ స్టేషన్ల నిర్వహణ ఎప్పటికప్పుడు నిర్వహించాలని పేర్కొన్నారు. లైన్ల పెట్రోలింగ్ చేపట్టాలని, వ్యవసాయ, టీఎస్ఐపాస్, నాయీ బ్రాహ్మణ, దోభీఘాట్, లాండ్రీల సర్వీసుల మంజూరు ఆలస్యం కాకుండా చూడాలన్నారు. సిబ్బంది విధిగా పని చేసే చోటే నివాసముండాలని ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్‌లు బి.వెంకటేశ్వర్ రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు కిషన్, అశోక్‌కుమార్, సదర్ లాల్, బీకంసింగ్, వరంగల్ ఎస్ఈ మధుసూదన్, మహబూబాబాద్ ఎస్ఈ నరేశ్, డీఈ ఐటీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

టమాట.. నో ‘మాట’



- ఆకాశాన్నంటుతున్న ధర..కిలో రూ.80
- వర్షాకాలం ఆలస్యమే కారణమంటున్న వ్యాపారులు
- సగానికి పైగా పడిపోయిన దిగుమతులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో కొనుగోలుదారుల నోటి నుంచి ట‘మాట’ కావాలని వినిపించడం లేదు. ప్రస్తుతం కిలో రూ.80 పలకడంతో వామ్మో అంటున్నారు. నెలన్నర క్రితం కిలో టమాట రూ.10–15 రిటైల్‌గా బాక్స్(25కిలోలు) రూ.250–300 విక్రయించగా.. ప్రస్తుతం రిటైల్ రూ.60–80కుబబాక్స్ టమాటా రూ.1800కు అమ్ముతున్నారు. ఈధర రూ.2వేల నుంచి 2500వరకు పెరిగే అవకాశాలున్నాయని వ్యాపారులు తెలిపారు. ధర పెరిగితే కిలో టమాట రూ.100 నుంచి రూ. 120 విక్రయించాల్సి ఉంటుందన్నారు. లక్ష్మీపురం మార్కెట్‌లోని హోల్‌సేల్ వ్యాపారులు ఏపీలోని చిత్తూరు జిల్లా మదనపల్లి, ముల్కలచెరువు, నెల్లూరు ప్రాంతం నుంచి ఎక్కువగా టమాట దిగుమతి చేసుకుంటారు. అలాగే కర్ణాటకలోని చింతామణి, కోలార్ మార్కెట్ల నుంచి కూడా దిగుమతి చేసుకుంటారు. అయితే వర్షాలు ఆలస్యం కావడంతో పాటు ఉత్తర భారతదేశం నుంచి కూడా హోల్‌సేల్ వ్యాపారులు మదనపల్లి తదితర ప్రాంతాలకు రావడంతో టమాట ధర అమాంతం పెరిగినట్లు తెలుస్తోంది.

సగానికి తగ్గిన దిగుమతి...

లక్ష్మీపురం మార్కెట్‌లో టమాట వ్యాపారులు నిత్యం 10 నుంచి 15 డీసీఎంలలో సుమారు 6వేల బాక్సులను దిగుమతి చేసుకుంటారు. అయితే ప్రస్తుతం ధరలు ఆకాశాన్నంటుండడంతో దిగుమతి ఒకేసారి 2000బాక్సులకు పడిపోయినట్లు టమాట హోల్‌సేల్ వ్యాపారి పాపని భాస్కర్ తెలిపారు. తక్కువ తెప్పించినా చిల్లర వ్యాపారులు కొనుగోలు చేయడం లేదన్నారు. సోమవారం బాక్స్ టమాట రూ.1800కు విక్రయించగా మంగళవారం రూ.2వేలకు విక్రయించాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. అంటే హోల్‌సేల్ ధర కిలోకు రూ.90 పడుతుందని చిల్లర వ్యాపారులు రూ.120లు కిలో అమ్మాల్సి ఉంటుందన్నారు. కొత్త టమాట వస్తే తప్పా ధరలు తగ్గే అవకాశం లేదని మార్కెట్ వర్గాలు తెలిపాయి.